# నీడలేని నాడు

బండిదిగి కాంపౌండులోకి వెళ్ళిన మోహనమూర్తికి ఎదురుగా తాళం అగపడింది.

"నాన్నగారు లేరే ఇంట్లో" అన్నాడు వెనక్కి తిరిగి భార్యతో.

"ఎక్కడికో వెళ్ళుంటారు లెండి....సామాను వరండాలో పెట్ట వయ్యా. ముందు ఆ అబ్బాయికి డబ్బిచ్చి పంపించండి."

చెప్పిన పని చేశాడు మోహనమూర్తి.

"మనం వస్తామని రాసిన ఉత్తరం అందింది మావగారికి."

"ఎలా చెప్పగలవు ?"

నవ్వింది శారద "కుమారుడు వస్తున్నాడని కుర్చీలు,మంచం అన్నీ వరండాలోనే ఉంచారు."

"అయితే మరెక్కడికి వెళ్ళి ఉంటారంటావు ?"

"బజారుకు వెళ్ళారు నాయనా !"

ఉలికిపడి శారద వంక చూశాడు.

మాట్లాడింది పక్కింటి మామ్మగారు...."ఎంత సేపయిందండీ మామ్మగారూ."

"ఈపాటికి వస్తుండాలి ! అంతా కులాసానా అమ్మాయ్ ?"

"బాగానే ఉన్నామండి."

"మీ మావగారూ బాగానే ఉన్నారులే ! అయినా పాపం పెద్దతనం లోనే వంట నెత్తినపడింది. ఇవన్నీ ఏనాడో చేసినపాపం అనుకో. మీ అత్తగారు లక్ష్మీదేవిలా ఇంట్లో తిరుగుతున్నంతకాలం ఎలా ఉండేదంటావు ఇల్లు - నా మతి మండ ! తాళంచెవులు ఇచ్చిపోయాడు మా ఇంట్లో.

---

25-10-68 దీపావళి ఆంధ్రజ్యోతి వారపత్రిక

అవిద్దామని వచ్చి పోదేసుకున్నాను" అంటూ తాళంచెవులగుత్తి శారద చేతిలోపెట్టింది.

తాళంతీసి లోపలికివెళ్ళింది శారద, వెంట వెళ్ళాడు మోహనమూర్తి.

వంటింట్లో నాలుగు విస్తళ్ళు భోజనంచేసినవి ఉన్నాయి. వాటివి చూస్తూనే ఫక్కున నవ్వేసింది శారద, "రెండురోజులనుంచి ఇల్లు కడుక్కోలేదన్నమాట!" అంది.

మోహనమూర్తి మాట్లాడలేదు. అతన్ని ఆ దృశ్యం కలిచివేసింది. అతనికి తెలుసు. తండ్రి ఎంత బద్ధకపుమనిషో "అవసలు రెండు రోజులవో నాలుగురోజులలో.... ఇది అమ్మలేని ఇల్లు!" అనేసి వాకిట్లోకి వెళ్ళిపోయాడు.

"అమ్మ పోయి ఆర్నెల్లు అవుతోంది" అనుకున్నాడు పడకకుర్చీలో కూర్చుని....

తల్లి ఉన్నరోజుల్లో ఎప్పుడయినా శలవుల్లో తనువస్తే ఆవిడ పడే హడావుడి గుర్తుకొచ్చిందతనికి. "అబ్బాయికి నేనుచేసే మావిడికాయ పచ్చడి ఇష్టం. తప్పకుండా తీసుకురండి. బెండకాయలు, తోటకూర— చల్లపులుసులోకి." అని అప్పటికప్పుడు ఆయన్ని బజారు పంపేది "నేను వెడతాలేమ్మా" అని అంటున్నావినేది కాదు, "ఉన్న కాసేపు నా దగ్గర లేకుండా అదేవిటిరా" అని. అందుకనే ఇల్లు కదలకుండా ఇంట్లోనే ఉండిపోయేవాడు తను.

నాన్నగారు "అబ్బాయికి పచ్చిమిరపకాయ బజ్జీలు ఇష్టమని మంచివి ఏరి తెచ్చాను మధ్యాహ్నం వేయి" అంటే ఆవిడ ఫకాలున నవ్వేసేది. "వాడిని అడం పెట్టుకుని మీరు తినేద్దామనా." అని.

"ఏదీ ఇప్పుడా హడావుడి?"

"ఎంతసేపయింది మీరొచ్చి?" అన్నమాటలు వినబడడంతో అటు చూశాడు మోహనమూర్తి. తండ్రిని చూస్తూనే లేచినిలబడి "ఇప్పుడేనండి" అన్నాడు.

ఆయన చేతిలోవి సంచిని అందుకుని లోపలికి తీసుకువెళ్ళాడు. ఆయనకూడా లోపలికి వచ్చారు. శారద ఇల్లు కడుగుతుండటం చూసి "పాలేరుచేత ఇల్లు కడిగిద్దామని అనుకుంటూనే బద్దకించాను" అన్నారు నేరం చేసినవాడిలా.

"ఇవి నాలుగురోజుల విస్తళ్ళేమోనని అనుమానంగా ఉందిట మీ అబ్బాయికి" అంది శారద నవ్వుతూ.

"అవునమ్మా, వాడు చెప్పినది రైటే!"

"అంటే రోజుకొక విస్తరా?"

"రెండవపూట ఉపోషమన్నమాట!" విసుగ్గా అంటూ సంచి బోర్లించాడు మూర్తి.

ఎదురుగా మామిడికాయలు, బెండకాయలు, తోటకూర, పచ్చిమిరప కాయలు అతన్ని వెక్కిరించాయి. అక్కడ నిలబడలేక వరండాలోకి వెళ్ళి పోయాడు.

"మీ వంట్లో బాగుంటోందా?" అడిగాడు మోహనమూర్తి— తండ్రివచ్చి తన కెదురుగా కూర్చుంటే.

అది విననట్టుగా "ఎన్నాళ్ళు శెలవు పెట్టావు" అనడిగారు కొడుకుని నారాయణమూర్తిగారు.

"నాలుగు రోజులు."

కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారిదరూ. మోహనమూర్తి బల్లమీద పేపరు తీసుకుని తెరిచాడు.

నారాయణమూర్తిగారికి రెండు విషయాలు నచ్చలేదు. మొదటిది నాలుగురోజులు శెలవుపెట్టి రావడం, రెండవది పిల్లల్ని వదిలేసి రావడం. ఆ మాటే చెబుదామనుకున్నాడాయన. కాని అతను పేపరు చదువుకుంటుండటం గమనించి మాట్లాడలేకపోయారు. అతనివంక తదేకంగా చూస్తుండి పోయారాయన.

"నా పోలిక వాడిని కనేశాను. ఇక మీ ఫొటో ఒకటి ఏర్పాటు చేసుకోవాలింట్లో!" అంటూండేది రాజేశ్వరి నవ్వుతూ. "కావాలంటే నా ఫొటో ఒకటి ఇంట్లో కట్టుకుందువుగాని, పిల్లలకిమాత్రం నీ పోలికే రానీయి—

నువ్వే అంటూంటావుగా—'ఏదో ఒంటరిగా ఉండిపోతారని చేసుకున్నానని' అనేవాడు తను.... అంతలో ఆయనకి మళ్ళీ పిల్లలు గుర్తుకొచ్చారు! "పిల్లల్ని తీసుకుని రాలేదేం" అనడిగారు.

"చదువులు పాడయిపోతాయని మా బావమరిదింట్లో ఉంచాను ఈ నాలుగు రోజులు."

మళ్ళా ఆయన ఆలోచనలు రాజేశ్వరి ఉండగా మనవడిని బడికి పంపడం వైపుకి సాగిపోయాయి. "ఇప్పుడంటె ఇలా నాలుగే రోజులు సెలవుపెట్టి వచ్చారుగాని వాళ్ళమ్మ బతికున్న రోజుల్లో ఒకనెల రోజులు తీసుకునేవారు. అలా ఒకసారి వచ్చినప్పుడు రాజేశ్వరి బడిలో మాష్టారుని పిలిపించి పిల్లాడిని ఆయనవెంట పంపించింది. 'ఇంట్లో కూర్చుంటే వెధవకి అల్లరి ఎక్కువయిపోతోంది.' అంటూ. నిజానికి వాడి అల్లరి ఆవిడకి చాలా ఇష్టం. అయితే వాడు పలకుచ్చుకుని తన కళ్ళముందు బడికి వెళ్ళడంకూడా ఆవిడకిష్టమే. అందుకే వాడికి బడికి వెళ్ళేవయసు లేకపోయినా పంపింది.

పంపిన కాసేపటికే వాడు ఏడుస్తూ వచ్చేశాడు! వాడు ఏడిస్తే ఆవిడ కొడుకుని, కోడల్నికూడా లక్ష్యపెట్టేదికాదు—ఆ ఏడుపుకి కారణం వాళ్ళయితే! "ఏం నాయనా! ఏమయింది!" అంటూ ఎదురెళ్ళి వాడి నెత్తుకుంది.

ఎర్రటిముఖం ఏడుపువలన ఇంకా కందిపోయింది వాడికి. కళ్ళలోంచి ముత్యాల్లాబొట్లు పడుతున్నాయి. వాళ్ళ బామ్మని చూడగానే వాడు బావురుమన్నాడు "మరే బామ్మగారూ—వారు నన్ను కొట్టాడు" అన్నాడు వాడు.

"ఎవరు, మాష్టారా?"

"అవునన్నట్లు తలూపాడు."

"పద చెబుతా వాడిపని" అంటూండగానే మాష్టారే వచ్చేశారు.

"అది కాదక్కయ్యా" అంటూ.

అతను ఆవిడకి వరసకు తమ్ముడవుతాడు.

"ఏది కాదురా—పసిపిల్లాడిని కొడతారు(ట్రా—"

"ఆయన చెప్పేది వినమ్మా — అయినా పంతులుగారు కొట్టకుండా పెంచగలవా ? ఏమయింది మాష్టారూ" అన్నాడు మోహనుడు।

మాష్టారుకి ధైర్యంవచ్చింది. "అదికాదండీ అక్కయ్య చెప్పింది. వీడికి శ్లోకాలు, పద్యాలు వచ్చునని పిల్లలందరి ముందూ చెప్పిద్దామని "చెప్పునాన్నా — పద్యం చెప్పు" అన్నాను. "నేను చెప్పను పోరా !" అన్నాడు. నేను వెళ్ళి చెవి పుచ్చుకుని "తప్పు అలా అనకూడదు" అన్నాను.

అంతే. వెంటనే లేచి ఏడుస్తూ 'మా యింట్లో మా బామ్మగారుంది. తాతయ్యున్నారు. పాలేళ్ళున్నారు. కొట్టిస్తాను, అంటూ వచ్చేశాడు."

అంత కోపంలోనూ ఆవిడకి నవ్వొచ్చేసింది. "మా నాయనే— బామ్మగారంటే నీకెంత ఇదిరా" అంటూ మనవడిని కౌగలించుకుని ముద్దు పెట్టుకోవడం మొదలెట్టింది.

మోహనుడికది నచ్చలేదు. "అటువంటప్పుడు మందలించడం పోయి ఇదేమిటమ్మా. అరేయ్ వాసూ ఇటురా" అన్నాడు.

వాడు మళ్ళీ బామ్మ ఒడిలోకి దూరిపోయాడు.

అందుకే అమ్మమ్మలదగ్గర, బామ్మలదగ్గరా పిల్లల్ని చదివించకూడదు. ఇదంతా చూస్తూ కూర్చున్న తను కలిపించుకుని "వాసూ, మాష్టారుని 'ఏరా' అనచ్చా. తప్పుకదూ ?" అన్నాడు.

"బామ్మగారనలా !" అని వాడి సమాధానం.

మాష్టారుకూడా నవ్వేశాడు....

ఆలోచనల్లోంచి బయటపడి చూస్తే మోహనమూర్తి లే డక్కడ, పేపరుమాత్రం పడివుంది. లోపలినుంచి మెల్లిగా మాటలు వినబడు తున్నాయి. "బాగానే ఉందండి వరస. ఆర్నెల్లతరువాత చూశారుకదా మీ నాన్నగారిని. అలా బొమ్మలాగా కూర్చుంటారే ఎదురుగా. మాటామంచీ అక్కరలేదా ?" అంటోంది శారద.

"మాటా మంచి అయిపోవడంవలననే లేచి వచ్చేశాను. ఆయనతో ఏముంటాయే మాట్లాడేందుకు ? పిల్లలు బావున్నారా ? ఆఁ!....మరి

మహో ! బ్రహ్మాండంగా !....పీటినిమించి నాకేమీ అగపడదం లేదు. మొదటినుంచి నాన్నగారిదగ్గర భయమేగాని చనువులేదు మాకు. అమ్మ తోనే ఈ ఇంటి కళంతా పోయింది" అని కాసేపాగి "నాకేం తోచడం లేదు బాబూ" అన్నాడు.

ఫకాలున నవ్వేసింది శారద. "అప్పుడే పిల్లలమీదికి గాలిపోయిం దేమిటి ? అలాగే మావగారికి మీరు కులదీపకుల్లో ఒకరుకదా మీ మీద ఆయనకీ గాలిపోతుండచ్చు !"

"అందుకనేగదా వచ్చిందిమరి ! ఆ డ్యూటీ అయిపోయింది."

"ముక్కుమీద గుద్దినట్టు మాట్లాడటం అలవాటయిపోయింది మీకు మరీను. ఇప్పుడు నేను వెళ్ళి మావగారితో ఎంతసేపు మాట్లాడతానో చూడండి ! పాపం పిల్లలతో మెలిగిన మనిషి ఒంటరిగా ఉండటంతో ఎంతగా బెగులెత్తి పోయార్రో !"

"జీవితం అన్న పరుగుపందెంలో ముందు వెళ్ళిపోయినవాళ్ళు ఎప్పుడూ అదృష్టవంతులు శారదా !"

నారాయణమూర్తిగారు నవ్వుకున్నారు "ఈ ఆరునెలలుగా ఒంటరి జీవితానికి అలవాటు పడలేక తను పడుతున్నబాధ తనకే తెలుసు ! ఎక్కడ చూసినా రాజేశ్వరి జ్ఞాపకాలు...."

"మావయ్యగారూ" శారద పిలిచింది.

కళ్ళు తెరిచారు నారాయణమూర్తిగారు. ఎదురుగా శారద అగ పడింది. కొడుకుతో ఎన్నో మాట్లాడదామనుకున్నాడు తను. వాడు విసిగిపోయి 'ఆయనతో ఏం మాట్లాడతాం' అని వెళ్ళిపోయాడు. కోడ లితో నయినా కాసేపు సరదాగా మాట్లాడకపోతే ఇద్దరూ కలసి వెళ్ళి పోతారు."

"మావయ్యగారూ" మళ్ళీ పిలిచింది.

"ఏమ్మ పిలిచావా ?"

"మీ వంట్లో ఆరోగ్యంగా ఉంటోందాండి"

మళ్ళీ వాడడిగిన ప్రశ్నే ! ఇదితప్ప ఇంకొకటి అడగలేరా ? తనని

చూడగానే అనారోగ్యంతో బాధపడిపోతున్నట్లు అగుపడతాడు తను. వీళ్ళలో తనపట్ల ప్రేమ కావాలి తనకు, ఆత్మీయత కావాలి, జాలిమాత్రం కాదు.

"మావయ్యగారూ !"

అరెరె మళ్ళీ ఆలోచనలు ! వెళ్ళిపోతుంది విసిగిపోయి. మాట్లాడే యాలి ఏదో ఒకటి. "పిల్లలు బాగున్నారమ్మా! నీ వంట్లో బాగుంటోందా !" వెధవ ప్రశ్నలడిగాడు ఏది వద్దనుకుంటోందో అవే వస్తాయి ?

నవ్వింది శారద "మాకేం నిక్షేపంగా ఉన్నాం. ఈ వయసులో మీరు వండుకోలేక నానా ఇబ్బంది పడుతున్నారని మీ అబ్బాయి బాధపడు తుంటారు. మాతోపాటు వచ్చేయకూడదూ మీరు"

నవ్వొచ్చింది ఆయనకి. రాజేశ్వరి కాపరానికి వచ్చిందీ ఇంట్లోనే. పిల్లలు పుట్టిందీ ఇంట్లోనే. వాళ్ళకిక్కడే పెళ్ళిళ్ళు జరిగాయి. జీవితంలో కష్టాలు, సుఖాలు పంచుకున్నారు తనూ రాజేశ్వరి ఇక్కడనే.

"మిమ్మల్ని తీసుకెడదామనే వచ్చాం మేమిప్పుడు. ఇల్లు మనవాళ్ళ కెవరికయినా ఇచ్చేయండి ఉండేందుకు. దీపం పెడుతుంటారు."

ఒక విషయం గుర్తుకొచ్చింది. నారాయణమూర్తిగారికి....కొత్తగా ఈ అమ్మాయి శారద కాపరానికొచ్చింది. "కొడుక్కీ, కోడలుకి గదిలో పక్కవెయ్యి. మనం ఇంక వరండాలోకి చేరదాం !" అన్నాడు తను నవ్వుతూ రాజేశ్వరితో.

"ఎలా అనగలిగారా మాట ? ఈ ఇంట్లో అడుగుపెట్టినది మొదలు నే నాగది వదలలేదు. ఇప్పుడూ వదలను. నిజానికి చిన్నవాళ్ళకన్నా పెద్ద వాళ్ళకే అవసరం ! బ్రతికినన్నాళ్ళు బ్రతకంకదా ! పోయాక మీరెవరో నే నెవరో....కావాలంటే కొడుకులకి పైన రెండు గదులు కట్టించండి. అప్పటి దాకా వాళ్ళకి హాలే పడకగది."

అక్షరాలా అలాగే జరిగిందికూడా. ఇంక పరాయి వాళ్ళకివ్వడమా తనిక్కడుండవలసినదే ఆ జ్ఞాపకాల మధ్య.

"మావయ్యగారితో నేను మాట్లాడతాను—అంటూ వెళ్ళావు అప్పుడే వచ్చేశావేం ?" అంటున్నాడు మోహనమూర్తి.

ఉలికిపడి కళ్ళు తెరిచారు నారాయణమూర్తిగారు. ఎదురుగా కోడలు లేదు.

"మావయ్యగారు బాగా మారిపోయారు. పెద్దవారై పోయారు. పాపం ఎప్పుడూ కళ్ళు మూసుకుని ఏమిటో - ప్చ్"

"పిల్లలని భయంతోపాటు ప్రేమతోకూడా పెంచాలి. వాళ్ళకి, మనకి మధ్య అగాథం ఏర్పరచుకోకూడదు. రేపుకూడా ఉండి ఎల్లుండి బయలు దేరుదాం. ఇక్కడ నాకు బోరుకొడుతోంది."

నీరయిపోయారు నారాయణమూర్తిగారు.

మర్నాడు చెప్పినంతా చేశాడు మోహనమూర్తి. "నాన్నగారూ, మరి మేమీవేళ వెడతామండి! పిల్లలు దాన్నివదిలి వుండలేరు" అన్నాడు తండ్రిదగ్గర కొచ్చి.

ఆయనకి బాధనిపించింది. కోపమూ వచ్చింది. "ఒరేయ్ నాయనా, అమ్మతోటే ఈ యింటికీ, మీకూ సంబంధాలు పోయాయిట్రా? నేను లేనురా. గుర్తుంచుకోరేయ్. అమ్మ ఒక్కతే కనలేదురా. నేనూరా! ఈ నాడు నువ్వింతవాడ వయావంటోరేయ్ మోహనుడూ, కారణం ఎవరురా? నేను రోరేయ్ నేను! ముప్పయిమంది నడుగు—కాదనగల సత్తా ఎవడికుందో. వాడినట్టుకొచ్చి నా ముందుంచు. నే చెబుతానోరేయ్. వాడి గుండెమీద చరిచి మరీ చెబుతాను. "నేనంత భయం వాళ్ళకి నేర్పకపోతే గేదెల్ని కాచుకునేవాళ్ళు" అవరా అని చెబుతా!....నేను మీతో బోలెడు మాట్లాడాలిరా! మీ పిల్లల్ని దాచేయకండి! నేను మీతో సరదాగా మాట్లాడ లేకపోవచ్చు. గానోరేయ్, మీ రంటే ఎంత ప్రేముందో ఈ ఇంటి నడగండి! నన్ను దూరంచేయకండి—ఆలోచనల్ని కట్టిపెట్టి "అప్పుడే వెళ్ళిపోతారా?" అన్నారు.

కాని ఆ వేళకి మోహనమూర్తి అక్కడలేదు.

వాళ్ళని బస్సెక్కించి వచ్చి తలుపుతీసి నిలబడ్డారు నారాయణమూర్తిగారు. ఇల్లు బోసిగా ఉంది. అంతకన్న ఆయన మనసులో ఏదో వెలితి ఏర్పడి పెరిగి పెద్దదయి పోతోంది.

తనకిక మిగిలినవాళ్లు తనపిల్లలే! రాజేశ్వరి ఉన్నన్నాళ్లూ వాళ్ళకి, తనకి మధ్య ఇంతదూరం ఏర్పడుతుందని తను కలనైనా అనుకోలేదు. అసలు ఆలోచించే అవసరమూరాలేదు. ఇప్పుడు ఆవిడలేకపోతే తనదగ్గర రెండురోజులుండలేకపోయాడు. ఆత్మీయతతో మాట్లాడేవాళ్ళు లేకపోతే తనేమయిపోవాలి? ఏమయిపోవాలి?

అదేప్రశ్న. అదే ఆలోచన ఆయన్ని వేధిస్తోంది.

మధ్యాహ్నం పోస్టులో చిన్నకొడుకుదగ్గరనుంచి వచ్చిన ఉత్తరం ఆయన్ని ఎంతగానో ఓదార్చింది. "పండగకి మీ రొక్కరూ అక్కడ ఎందుకుండడం? వెంటనే బయలుదేరి రండి. అందరం కలిసి ఇక్కడే ఉందాం" అని రాశాడు.

సాయంత్రమే చిన్నకొడుకు దగ్గరకు బస్సెక్కారాయన.

"అమ్మ పోయినా నాన్నగారిలో అమ్మని చూసుకుంటున్నాము" అని వాడు అనుకోవాలి. "నాన్నగారు మారిపోయారు. ఎంతో సరదాగా మాట్లాడుతున్నారు. పూర్వం ఆయన్ని చూస్తేనే భయంవేసేది" అనివాడు పెద్దవాడికి వ్రాయాలి. అప్పుడు వాడు అభిప్రాయం మార్చుకోవాలి....

"బామ్మగారేది తాతగారూ!" గుమ్మంలో అడుగుపెడుతూనే మనవడడిగిన ఈ ప్రశ్నకి ఒక్క క్షణం నిలబడి పోయారాయన.

"తప్పమ్మా, అలా అడక్కూడదు తాతగారిని. లోపలికిపోయి అడుకో" అని మందలించింది కొడుకుని జయలక్ష్మి. "రండి మావయ్యగారూ, మీవంట్లో ఆరోగ్యంగా ఉంటోందా?"

ఒక్కసారి విసుగొచ్చేసింది ఆయనకి "ఆ ప్రశ్నతప్ప మరోప్రశ్న రాదా మీ కందరికి!" అనేశారు అప్రయత్నంగానే

జయలక్ష్మి తెల్లబోయింది. మావగారిలోని ఆ విసుగుదలకి కారణం ఆమెకి తెలియలేదు. చెంబు కిందపెట్టి "కాళ్ళు కడుక్కోండి" అని మాత్రం అనేసి గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

ఈసారి తెల్లబోవడం ఆయన వంతయింది.... కాసేపటికి తేరు కుని తనవంకనే చూస్తూ నుంచున్న మనవణ్ని దగ్గరకు తీసుకోబోయా రాయన.

"రాను" అన్నాడు వాడు.

"ఎందుకు రావు నాన్నా!"

"బామ్మని తీసుకు రాలేదుగా"

"ఇప్పుడే వస్తుంది నాన్నా-నన్ను ముందుగా పంపించిందిక్కడికి"

"మరి అమ్మనెందుకు కోప్పడ్డావు?"

"నేను కోప్పడలేదు నాన్నా-రా, బిళ్ళలు తెచ్చాను నీ కోసం."

వాడు మెల్లగా దగ్గరకు అడుగులువేశాడు.

"ఎంత సేపయింది మీరొచ్చి!"

తిరిగిచూశాడు నారాయణమూర్తిగారు.

గుమ్మానికి నిండుగా నిలబడి ఉన్నాడు గోపాల్—

"పిల్లలకి నీ ముఖం వచ్చింది. బాగానే ఉంది. కాని నీ పొడుగు వస్తే చచ్చామే! జానెడు జానెడు పిల్లల్ని చూడలేను ఇంట్లో" అంటుండే వాడు తను రాజేశ్వరితో. "మరేం భయంలేదు. మీకన్న జానెడుపొడుగు ఒకడు. కనీసం బెత్తెడు ఎక్కువ ఒకడు ఉంటారు, తెలిసిందా, నేను గట్టిగా కోరుకున్నదేదీ జరగకుండా పోదు."

"ఏమో బాబూ, పెద్దవాడి విషయం చెప్పనుగాని చిన్నవాడుమాత్రం నీ కన్న ఒక రెండువేళ్ళు ఎదుగుతే గొప్ప. మంచంమీద అడ్డంగా సరి పోతుంది వాడికి"

"బాగానే ఉందిగాని జోకు, వాడు మీకన్న పొడుగయితే నాకే మిస్తారు?"

"ఏం కావాలేం?"

"మంచి కంచి పట్టుచీర కావాలి!"

"అంతేకదా! ఇప్పుడే కొనుక్కో పాపం"

"వాడు పొడుగయేదాకా వాటిని తాకను"

గోపాల్ ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు అంతా కలిసి తిరుపతి, కంచి వెడితే అక్కడ తనుకోరిన పట్టుచీర కొనిపెట్టాడు రాజేశ్వరికి.

కంటినిండా కొడుకుని మరోసారి చూద్దామని గుమ్మంవైపు చూశా రాయన.

అతనక్కడలేడు. తలుపుకి పక్కగామాత్రం బూట్లు అగపడ్డాయి. "ఛ. ఛ. పెద్దవాడు వచ్చినప్పుడూ ఇదేవరస. నా ఆలోచనలతో వాడు హడలిపోయాడు. వీడిదగ్గర అప్పుడే మొదలు." గభాలున లేచి ఇంట్లోకి వెళ్లారాయన. అయితే వంటింటిదగ్గరకు వెళ్ళిన మనిషి హఠాత్తుగా ఆగి పోయారు.

పెరట్లో పంపుదగ్గర టవలు కట్టుకుని నిలబడి ఉన్నాడు గోపాలం. పక్కనే నీళ్ళు తోరవటం చేస్తోంది జయలక్ష్మి. "ఒంట్లో బాగుందా అనడి గితేనే అంత విసుగా?" అంటోంది.

"అదికాదు జయలక్ష్మి, వయసు పెరుగుతున్నకొద్దీ ఆరోగ్యం చెడిపోతోందన్న నమ్మకం వాళ్ళకి కలుగుతుంటుంది. అయితే తల వంచ కుండా బ్రతికినవాళ్ళకి అది చాలా బాధాకరమయిన విషయం. అందువలన ఎక్కడికి వెళ్ళినా అదేమాట విన్నప్పుడు వాళ్ళలోని లోపం పసికట్టేసి అడుగుతున్నట్లుగా అనిపిస్తుంది. అందువల్లనే అటువంటి విషయాలు రానివ్వకూడదు మనం"

"అవికాకపోతే మరింకేమి మాట్లాడుతారుట" అని నవ్వి "మీరు మాట్లాడేరుగా గత అరగంటగా?" అంది.

"ఆయన పద్ధతే అది. మొదటినుంచీ ఆయనదగ్గర మాకు చనువు లేదు. మా అమ్మని అడ్డం పెట్టుకుని మాట్లాడుకునేవాళ్ళం. ఇప్పుడావిడ లేకపోవడంతో మా కసలు మాటలే కరువయిపోతున్నాయి. అది సహజం కూడాను! ఆయన ఆలోచన, లోకంవేరు. మనవి వేరు. అవి కలవవు."

గబగబ వెళ్ళిపోయి వరండాలో మంచంమీద పడుకున్నారు నారా యణ మూర్తిగారు——

రెండుసార్లు ఖచ్చితంగా విన్నాడు తను—వాళ్ళకి, తనకి సంభాష ణకి విషయాలే ఉండవని. తన ఊహలు వేరు, వాళ్ళవి వేరని. తన పనల్లా భోజనంచేసి వరండాలో మంచం వేసుకుని పడుకోవడమని. అదిష్టంలేకపోతే బజార్లంట తిరగడం, చివరికి తిరిగి ఇంటికిపోవడం—

"అమ్మబోయి ఏశాది కాలేదింకా—అందువలన మనం పూజచేసుకో కూడదన్నారు" అన్నాడు గోపాల్ స్నానం చేసివచ్చి.

పూజ అనగానే గుర్తుకొచ్చింది ఆయనకి. రాజేశ్వరి కాపరానికి వచ్చిన రోజునుంచి ఈనాటిదాకా తను ఈ వ్రతం మానిందిలేదు. మధ్య మధ్య అంటుండేవాడు "నాకింకా ఏమిటి రాజ్యం తీర్చవలసిన కోర్కెలన్నీ తీర్చేశాను. పిల్లలని కూర్చోపెట్టి చేయించు" అని. వల్లకాదు అనేది. శాస్త్రోక్తంగా చేయాలసిందే. పూజయేదాకా కాఫీకూడా పోసేదికాదు. తరువాత్తరువాత ఎంతో కష్టపడి ఆ కన్సెషన్‌మాత్రం తెచ్చుకున్నాడు.

హఠాత్తుగా ఆయనకి కొడుకు గుర్తుకొచ్చి 'వెళ్ళిపోయే ఉంటాడు. ఈపాటికి విసిగిపోయి' అనుకుంటూ అతనివైపు చూశారు.

అతను కూర్చునే ఉన్నాడు.

తనని కాసేపు మాట్లాడించి "ఫర్లేదు. నాన్న ఏడవకుండా మాట్లా డించేశాను. కాని. జయా, ఆయనతో మాట్లాడడం ఎంత కష్టమను కున్నావు!" అంటాడు బహుశ ఇంట్లోకిపోయి. కానారేయ్. గోపా లుడూ, మా నాన్నెప్పుడయినా కల్లో అగపడితే అదుగోరేయే ఏం చెబు తాడో విను. ఈనాడు నన్ను తీసిపారేస్తున్నావు. నాన్నతో మాట్లాడటం కష్టం అని చీ కొట్టేస్తున్నావు. కాని నేనురా కొడుకుని? మా నాన్న నాలాగే వచ్చాడురా, మా యింటికి. నాన్నతో మాట్లాడేందుకు విషయా లుండ వన్నానుట్రా? నువ్వు బయట మంచంగాడివి. నేన్నీతో మాట్లాడు తున్నానుట్రా? అనలేదంటే అవలేదు. అంతే ఇద్దరం ఒక మంచంమీద పడుకొనే వాళ్ళమొరేయ్! పెళ్ళాం గిళ్ళాం ఆ నాలుగు రోజులూ జాన్తానై! అది పోట్లాడలేదు. గానారేయ్. పోట్లాడుంటే 'నీ బాబుతో చెప్పుకోవే రాజ్యం' అనేసుండేవాడిని....

"మీతోపాటు చదువుకున్నాట్ట రాజశేఖరంగారిని ఆయన అల్లుడు మా ఆఫీసరు లెండి. మొన్న ఆఫీసుకి వచ్చాడాయన మిమ్మల్ని మరీ మరీ అడిగాడు" అన్నాడు గోపాలం.

ఆలోచనలు వెంటనే రాజశేఖరంవైపుకి మళ్ళాయి "అవును వాడు తనూ కలిసి చదువుకున్నారు. వాడి-తన స్నేహంలో ఒక్క మరపురాని విషయం ఉంది." అది గుర్తుకు రాగానే ఉలిక్కి-పడ్డారు ఆయన.

"మనిషన్నవాడికి భయం సహజమేరేయ్. నారాయణా కాని ఇలా రాతిలో కప్పలా ఎన్నాళ్ళురా బ్రతకడం ? జీవితంలో మనకి తెలియని విషయాలు చాలా ఉన్నాయిరా ! వాటిలో మంచి ఉంది చెడూ ఉంది. కాఫీ త్రాగేముందు కారం తింటే కాఫీ రుచి ఇనుమడించినట్టు చెడుకూడా చాలా అవసరమేరోయ్ ! అప్పుడే వెలుగు మరీ వెలుతురుగా అగపడుతుంది.

నా వెంటొచ్చేయ్ ! నీ శ్రీరాముల వారిని గదిలో కూర్చుండమను ఒక్క వాక్యం, ఈ వారంపాటు వారిని కళ్ళు మూసుక్కూ-ర్చోమను కోప్పడద్దను. తరువాత మనిద్దర మొహం చేనని హామీ ఇచ్చేయ్ ! నా వెంటుండు, నీకు సుఖాల మెరుపులు చూపిస్తాను. క్రొత్త తనాల కాంతులతో కళ్ళు మిరుమిట్లు గొలిపిస్తాను. నీకు తెలియని విషయం లోకంలో ఉండకుండా చేస్తాను.

ఆ వారం భద్రంగా మంచిగంధం పెట్టెలో దాచేసి నీ గుండెల్లో దాచీసుకుందువుగాని. నడుముందు అన్నారు.

తను నడిచాడు. అతనివెంటే నడిచాడు. డ్రీమ్‌లాండ్‌లో తిప్పినట్లు తిప్పాడు. ఒకరోజున "ఫలానా" చోటు మిగిలిపోయింది రమ్మన్నారు. తను భయపడ్డాడు. రాలేనన్నాడు. వాళ్ళని చూసేందుకే భయమన్నాడు.

"నాకు తెలుసురా నారాయణ నీకు భయమని. ముందే చెప్పాకూడా ఆ మాట ! ఆ భయం పోగొట్టేందుకు మందుందొరేయ్-పద ! నీ మనసులోది ఎవరకైనా చెప్పేయటం ఎవరితోనయినా కష్టం, సుఖం చెప్పుకు నేడవడం. ఫలానా వాడుత్త లుచ్చా అని ఆ ఫలానా గాడితోనే చెప్పడం-

వగైరా మానసిక దౌర్బల్యాల నధిగమించవలసిన పరిస్థితుల కన్నిటికీ మందదేరా! మాద్దువుగానిరా. కొంచెం పుచ్చుకో—నీ చాతీ పెరుగుతుంది. ఇంకొంచెం పుచ్చుకో—పొడుగవుతావు. మరికొంచెం.. ఎదటివాడు చిన్న వాడవటం మొదలెడతాడు. ఆ పైన నువ్వుపర్వతం, వాడు చిట్టెలుక! గీతోపదేశం నీనే! కమాన్...."

ఆ వారం నిజంగా ఈ నాడెవరికయినా తెలుస్తే తను సిగ్గుపడేమాట వాస్తవమేగాని మధురస్మృతులుగా నిలిచిపోయిన రోజులవి...

మర్నాడుదయమే ప్రయాణమయ్యారు నారాయణమూర్తిగారు. రెండురోజులుంటాడనుకున్న తండ్రి హఠాత్తుగా బయలుదేరటం గోపాలానికి ఆశ్చర్యం కలిగించింది.

నారాయణమూర్తిగారి మనసులో ఒక్కటే ఆలోచన. ఇద్దరు కొడుకులదగ్గర ముచ్చట తీరిపోయింది ఇక మిగిలినది కూతురు. ఆ పిల్ల కూడా "నాన్నగారెప్పుడూ ఆలోచనలలో పడుంటారు. ఆ ఊహాలోకం లోంచి బయటకు తెచ్చేపాటి చనువులేదు మాకు" అనుకుందంటే తన శేషజీవితంలో శాంతివుండదు. అలా జరిగేందుకు వీల్లేదు. జరగనివ్వదు కూడా!

తనకై తను ఏర్పరచుకున్న కొన్ని పరిధుల్ని దాటితేగాని ఈ పరీక్షలో నెగ్గలేడు. రాజశేఖరంమీదుగా ఆ వారంరోజుల జీవితం గుర్తుకు రాగానే తనకు మార్గంకూడా అగుపడింది....పిల్లలదగ్గర ఆత్మీయత ఏర్పరచుకోవాలి తను. తనతో కష్టం, సుఖం చెప్పుకునే చొరవ వాళ్ళకి కలిగించాలి. దానికి మార్గం ఇప్పుడు తనకి తెలిసిపోయింది....

చీకటిపడిన తరువాత చెప్పాచెయ్యకుండా తండ్రిరావడం పద్మావతికి ఆశ్చర్యం కలిగించింది.

"అదేమిటమ్మా అలా ఆశ్చర్యపోతావు? నీ మీద గాలి మళ్ళింది. రెక్కలు కట్టుకుని వచ్చి వాలిపోయాను. నాకేమిటింక వంటరిగాడిని ఎప్పుడు ఎవరిని చూడాలనుంటే అప్పుడక్కడ వాలిపోవడమే! అలా జీవితం తామరాకుమీద నీటి బొట్టులాగా గడిపేయ దలుచుకున్నాను."

తండ్రి ధోరణి వింతనిపించింది పద్మావతికి. "రండి నాన్నగారూ, కాళ్ళు కడుక్కోండి. క్షణంలో వంటచేసేస్తాను. భోజనం చేద్దురుగాని" అంది.

"నో భోజనం. నో కాళ్ళు కడుక్కోవడం! అన్నీ పూర్తయాయి. నా పిల్లలతో నేను మాట్లాడేసమయంలో ఇటువంటి క్షుద్రమయిన విషయాలు రాకూడదు. ఈవెన్ రాజేశ్వరి అడ్డంవచ్చినా సంతోషించేది లేదు. "రాజ్యం, నేను ఒంటరిగా ఉన్నప్పుడు గుర్తుకు రాగానే—పిల్లలతో మాట్లాడేప్పుడు మధ్యకురాకు. నో రాకు మరి" అని చెప్పేస్తాను. లేకపోతే ఏమవుతోందో చూశావా అమ్మడు, మాట్లాడితే మీ అమ్మ వచ్చేయడం, వెర్రి వెధవలంతా నేనేదో ఆలోచనలో పడిపోతున్నానని నాతో మాట్లాడేందుకు వాళ్ళకి టాపిక్స్ ఐ మీన్ విషయాలు దొరకడం లేదని దుష్—దుష్ ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు రమ్మను వెధవల్ని.

"నా రేయ్ వెర్రివెధవల్లార! ఇదిరా కారణం నాకు దగ్గరగా రండిరా. మీకు ఇష్టమయిన విషయాలేమిటో నాకు తెలుసొరేయ్! నెంబర్‌వన్ గాడికి, సినిమాలు, పాటలపిచ్చి, పుస్తకాల పిచ్చి కమాన్ రారొరేయ్—ఏం మాట్లాడమంటావు చెప్పు."

మధ్యలో అడ్డం పడింది పద్మావతి. "నాన్నగారూ ముందు మీరు విశ్రాంతి తీసుకోండి. ఈ లోపల నేను వంటచేస్తాను. భోజనం అయాక మాట్లాడుదురుగాని, అప్పటికి మీ అల్లుడు వచ్చేస్తారు. సినిమాకి వెళ్ళారు."

"నో రెస్ట్....ఎవడూ వాడు అల్లుడు! కరెక్ట్ రమ్మను సినిమా నుంచి నేరుగా నా దగ్గరికి రమ్మను. ఎవడి మ్యూజిక్కు బావుంటుందో నే చెబుతా – ఏ సినిమా కెవడు రాశాడు నే చెబుతా. ఆఫ్టరాల్ గాళ్ళు నన్నంటారూ? వాడెవడూ నెంబర్టూగాడు గోపాలంగాడు. వాడికేవిటి? స్పోర్ట్స్! క్రీడారంగం! పేపరులో చివరిపేజీ వెధవగాడు నన్నంటాడు? అందులో నీకు ఓనమాలు నేర్పిందెవడొరేయ్ గోపాలం—నేనురా వింబుల్డన్ ఛాంపియ నెవర్రా–ఎమొచ్చ్యూరా, ప్రొసీ? ఆ రెండిటికి తేడా తెలియదా నే చెబుతా రారేరొయ్! వాడిపేరు చెబుతాను. వాడి ఊరు చెబుతాను. వాడి జీవితం

చెబుతాను. నన్నురా అంటావు – నాన్నగారితో మాట్లాడటం కష్టమనిరా అంటావు ?"

పద్మావతికి అర్థమయింది. పరిస్థితి వాళ్ళకేం తెలుసులెండి నాన్న గారూ – మీరు రండి–నే చెబుతానువాళ్ళకి – "నాన్నగారితో మాట్లాడడం మీకు చాతకాదురా" అని. ముందు మీరురండి....పిల్ల లెప్పుడూ అడుగు తుంటారు "తాతగారు ఎప్పుడొస్తారమ్మా" అని, మీరంటే వాళ్ళకి అంత ఇది. ఇద్దరూ నిద్రపోతున్నారు – లేవనా ఏమిటి ?"

"నో, లేపద్దు తల్లీ – నిద్రపోనీ ! పిల్లలకి నిద్రముఖ్యం"

"అవునండి. అమ్మ ఎప్పుడూ ఆ మాటే అంటుండేది. వేడి వేడి నీళ్ళ స్నానం. కంటినిండా నిద్రా ఉండాలి పిల్లలకని"

"మీ అమ్మకదూ ! కరెక్ట్ ! అది ఏం చెప్పినా అంతా కరెక్టే ! అమ్మ చెప్పినవేవీ మర్చిపోకమ్మా ! అది మనపాలిటి డాక్టర్. నాకు దేవత ! నన్ను నట్టేటిలోవదిలి వెళ్ళిపోయింది. ఆ ఇంట్లో ఎక్కడచూసినా మీ అమ్మ గుర్తుకొస్తుందమ్మా. అందుకే ఆ ఇల్లు వదల్లేను. నాకు అది దూరం అయిపోయినా దాని జ్ఞాపకాలు కావాలి....అనుక్షణం నాకు మీ అమ్మ గుర్తుకొస్తుంది. ఒకనాటిదా – ముప్పయి సంవత్సరాల స్నేహం మాది ! ఎన్నెన్ని సంఘటనలు, అవన్ని గుర్తుచేసుకుని నే నానందపడు తుంటే ఈ ఫూల్స్ అంటారు తల్లీ – నాన్నతో మాట్లాడడం కష్టం అని. అక్కడికీ రాజ్యాన్ని గుర్తురానీయకుండా ఉంచుదామని ప్రయత్నించాను. కాని ఓడిపోయాను. అందులోనే నాకు ఓదార్పుంది. నన్నర్థం చేసుకోరు వెధవలు—"

"వాళ్ళకి నే చెబుతానులెండి నాన్నగారు. మీరు ముందు కాసిని మజ్జిగత్రాగి పడుకోండి. రేపే వాళ్ళకి ఉత్తరం రాస్తాను"

"రాయమ్మా రాయి. ఒరేయ్‌ఫూల్స్. నాన్నని దూరం చేసుకోకండి, ఆయనది సహించలేదు. మనందరిమీద కళ్ళు పెట్టుకుని బ్రతుకుతున్నాడు. లేకపోతే అమ్మతోపాటే పోయేవాడు. అమ్మగా, నాన్నగా మనకిక మిగి లింది ఆయనే–అని రాసేయ్. కాగితం పట్టుకురా దగ్గరుండి–వ్రాయిస్తా. ఒరేయ్ రాస్కెల్స్....పట్టుకొచ్చావా ?–మొదలెట్టు–ఒరేయ్"

"మీరు ముందు పడుకోండి ఇప్పుడే తీసుకొస్తా."

"క్విక్. తెచ్చావా–రాస్కెల్స్. ఇంకా వెళ్ళలేదూ ఊ–ఒరేయ్ రా–స్కె–ల్స్"

అలా అంటూనే నిద్రపోయిన తండ్రిని చూసి నిట్టూర్చింది పద్మావతి – తలుపు చప్పుడయితే వెళ్ళి తీసింది. భర్తని "ఇష్" అని హెచ్చరించి లోపలికి తీసుకు వెళ్ళిపోయింది....నాన్నగారికి, నమస్కారం.

ఎలా చెప్పకుండా వచ్చారో అలానే చెప్పకుండానే వెళ్ళిపోయారు.

మీ అల్లుడూ–నేనూ తెల్లవారాక వచ్చిచూస్తే మీ మంచం ఖాళీగా ఉంది "ఇంటికి వెళ్ళిపోతున్నాను, ఖంగారుపడద్దు" అని రాసిన కాగితం అగపడింది.

హైదరాబాదులో ఉంటున్నదానిని కనుక మీరు వచ్చిన స్థితిని అర్థంచేసుకున్నాను. మీ దగ్గరనుంచి వచ్చాక అన్నయ్య ఇక్కడికి వచ్చి "నాన్నగారి దగ్గర రెండురోజు లుండలేకపోయాను" అని చెప్పారు కనుక మీ రాకకు పూర్వకథా తెలిసింది. మీ మనసులోని బాధా తెలిసింది.

కాని నాన్నగారూ, మీరక్కడే పొరపడ్డారు. ఆడపిల్ల ఎప్పుడూ మనస్సులో తల్లీతండ్రీ మెదులుతూనే ఉంటారు.

ఎప్పుడుపడితే అప్పుడు వెళ్ళి చూడటానికి శక్తిలేనిది కనుక పుట్టింటిని భద్రంగా ఒక పక్కన దాచుకుంటుంది.

మిమ్మల్ని చూశాను. మీలో అమ్మనీ చూశాను. నాక్కావలసిందదే. మీరు మాట్లాడనవసరం లేదు. మనసునిండా అమ్మని నింపుకుని మీరు వస్తేనే చాలు.

ఎప్పుడు మీకు నన్ను చూడాలనిపిస్తుందో అప్పుడు వచ్చేయండి. మా ఇద్దరికీ అంతకన్నా కావలసిందిలేదు.

మీ

"పద్మావతి"

నారాయణమూర్తిగారి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.